సాక్షి
వికారాబాద్

సోమవారం ✦ 8 ✦ మే ✦ 2023



గ్రామాల అభివృద్ధి 'ఫ్రీజింగ్'
గ్రామాల అభివృద్ధికి నిధుల ఫ్రీజింగ్ అడ్డంకిగా మారింది. నిధుల కొరతతో పనులు ముందుకు సాగడంలేదు. 8లో ▸



మతసామరస్యానికి ప్రతీక
కొండంగల్ మండల పరిధిలోని అంగడిరాయిచూర్ శివారులో వెలిసిన చిట్లపల్లి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 8లో ▸



సమ్మర్.. సందడే సందడి
ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు వేసవి సెలవుల్లో సందడి చేస్తున్నారు. వేసవి శిక్షణా శిబిరాల్లో చేరుతున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

ఆగని ఇసుక అక్రమ రవాణా

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూరు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమ రవాణా అరికట్టాలని గతంలో సాక్షాత్తు కలెక్టర్ ఆదేశించినా స్థానిక అధికారులు చర్యలు చేపట్టడంలేదు. ట్రాక్టర్ ఇసుక రూ.600 ధర నిర్ణయించినా అక్రమార్కులు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. అరికట్టడంలో స్థానిక రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి సమాచారం తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ఉన్నతాధికారుల ఆదేశం మేరకే ఆస్తుల జప్తు'

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో దీర్ఘ కాలిక రుణాలు తీసుకుని చెల్లించని రైతుల నుంచి ఆస్తుల జప్తు ఉన్నతాధికారుల ఆదేశం మేరకే చేస్తున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని సంబంధిత అధికారి ఆదివారం తెలిపారు. 'రుణాలు చెల్లించలేదని రైతుల ఆస్తులు జప్తు' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తా కథనానికి సంబంధిత అధికారి స్పందించారు. గడువు ముగిసిన రుణాలను ఎలాగైనా వసూళ్లు చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులే ముందుండి ఆస్తులను జప్తు చేయిస్తున్నారని ఆయన అన్నారు.

71 నోటీసులు

డీసీసీబీ బ్యాంకు నుంచి ఇద్దరు డీఎంలు, ముగ్గురు డీజీఎంలు వచ్చారని, వారి ఆధ్వర్యంలోనే ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తున్నారని వెల్లడించారు. 71 నోటీసులు జారీచేసి, ఆస్తుల యాక్షన్‌కు వెళ్లిన వారి నుంచే ఆస్తులను జప్తు చేస్తున్నారని వివరించారు. ప్రాపర్టీని సీజ్‌చేసే అధికారం వారికి ఉందని, స్వయంగా వారే చెప్పారని ఆ అధికారి పేర్కొన్నారు. ధారూరు పీఏసీఎస్ చైర్మన్, సీఈఓ, సిబ్బందికి సంబంధం లేకుండా డీఎం, డీజీఎంలు ప్రాపర్టీలు సీజ్ చేయిస్తున్నారని తెలిపారు.

రైతుల నుంచి బలవంతపు వసూళ్లు ఆపండి

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



ధారూరు: దీర్ఘకాలిక రుణాల కింద తీసుకున్న డబ్బులను రైతుల నుంచి బలవంతంగా వసూలు చేయడం తగదని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి అన్నారు. రైతుల్ని పీఏసీఎస్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. రుణాలు చెల్లించని రైతుల ఇళ్లకు వెళ్లి బైక్‌లు, టీవీలు, ట్రాక్టర్లు తీసుకెళ్లడం దారుణమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రుణాలన్నీ మాఫీ అవుతాయని అన్నారు. రుణాల వసూళ్ల కోసం రైతులను వేధించడం మానుకోవాలని తెలిపారు.

ప్రతీ నాయకుడికి ఎస్‌డీఎఫ్ పనులు

- అంతర్గత విభేదాలు పక్కన పెట్టండి
- బీఆర్‌ఎస్ ప్రతినిధులతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



తాండూరు రూరల్: గ్రామాల్లో పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న ప్రతి నాయకుడికి ఎస్‌డీఎఫ్ కింద పనులు అప్పగిస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం తాండూరు మండలంలోని బీఆర్‌ఎస్ ప్రతినిధులతో క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయన్నారు. గ్రామాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పని చేయాలని సూచించారు. అంతర్గత విభేదాలు పక్కన పెట్టి పని చేయాలన్నారు. ప్రతి గ్రామానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షలు ఇస్తున్నామన్నారు. ఆ నిధుల కింద చేపట్టే పనులను గ్రామాల్లో ఉన్న నాయకులందరికీ సమానంగా కేటాయిస్తానని చెప్పారు. రెండు రోజుల్లో ప్రొసిడింగ్‌లు అందజేస్తానని కూడా తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అందరూ పని చేయాలని సూచించారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్ మాదిగ

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం రెండు దశాబ్దాలుగా మాదిగలు, మాదిగ ఉప కులాలు పోరాటం చేస్తున్నాయని తెలిపారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

సీటీస్కాన్, ఎక్స్‌రే సేవలు బంద్!



మరమ్మతులకు గురైన ఎక్స్‌రే పెద్ద మెషిన్

- పెద్దాసుపత్రిలో మూలానపడిన పరికరాలు
- ఏడాదిగా పనిచేయని ఎక్స్‌రే పరికరం
- రోగులకు తప్పనితిప్పలు
- దృష్టిసారించని వైద్యాధికారులు

తాండూరు టౌన్: పేరుకే పెద్దాస్పత్రి.. సరిపడా వైద్యులులేక అరకొర సేవలే అందుతున్నాయి. దీనికి తోడు సీటీస్కాన్, ఎక్స్‌రే సేవలు కొంత కాలంగా బంద్ అయ్యాయి. దీంతో పేద రోగులు ప్రైవేటును ఆశ్రయించలేక నానాఅగచాట్లు పడుతున్నారు. ప్రైవేటులో స్కానింగ్, ఎక్స్‌రేలకు అడ్డూ అదుపూ లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఏడాదిగా ఎక్స్‌రే, రెండు నెలలుగా సీటీ స్కాన్ మెషిన్లు మూలానపడినా ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోవడంలేదు. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ కేవలం రూ. వెయ్యి తీసుకుని అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. ఒక్క నెలలో సగటున 600 మందికి పైగా స్కాన్ చేస్తున్నారు. అయితే సీటీ స్కాన్ మిషన్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ప్రైవేటు సెంటర్లకు వెళ్లాల్సి వస్తున్నది. అక్కడ రూ. 5 వేల నుంచి రూ.7 వేల మేరకు ఫీజు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఏడాది కాలంగా ఎక్స్‌రే మిషన్ పనిచేయడం లేదు. రెండేళ్ల క్రితం నూతనంగా కొనుగోలు చేసిన మెషిన్లు ఏడాదికే అటకెక్కాయి. కేవలం రూ. వంద సాధారణ ఫీజు తీసుకుని అందుబాటులో ఉన్న చిన్న మిషన్‌తో మాత్రమే ఎక్స్‌రే తీస్తున్నారు. నడుము, కడుపు తదితర ముఖ్య భాగాలకు ఎక్స్‌రే తీయడం చిన్న మిషన్‌తో కావడం లేదు. దీంతో జనాలు ప్రైవేటు ఎక్స్‌రే కేంద్రానికి వెళ్లి రూ.550 ఆపై డబ్బులు ముట్ట జెప్పాల్సి వస్తున్నది. పేద ప్రజలపై పడుతున్న ఈ భారాన్ని తగ్గించడానికి ఆస్పత్రి వర్గాలు ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. సీటీస్కాన్, ఎక్స్‌రే కోసం జిల్లా ఆస్పత్రికి నెలలో వెయ్యి మందికి పైగా ప్రజలు వస్తుంటారు. వీరంతా ఉసూరుమంటూ ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తున్నది. పాడైపోయిన యంత్రాలను మరమ్మతు చేయించడానికి నెలల కాలం పట్టడమేమిటని ఆరోపిస్తున్నారు. వెంటనే ఆస్పత్రి అభివృద్ధి సంఘం పట్టించుకుని సీటీ స్కాన్, ఎక్స్‌రే మిషన్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సీటీస్కాన్ పరికరం పనిచేయకపోవడంతో మూసివేసిన గది

త్వరలోనే పునరుద్ధరిస్తాం

ఎక్స్‌రే మిషన్ ఏడాది క్రితం పాడైపోయింది వాస్తవమే. అలాగే రెండు నెలల క్రితం సీటీ స్కాన్ మిషన్ కూడా మరమ్మతులకు గురైంది. వీటి మరమ్మతుల కోసం కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్ వచ్చింది. త్వరలో సీటీ స్కాన్ సేవలు పునరుద్ధరిస్తాం. ఎక్స్‌రే మిషన్ కూడా మరమ్మతు చేయిస్తాం.

– డాక్టర్ రవిశంకర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

డాక్యుమెంట్లు ఏమాయె

ధరణి వెబ్‌సైట్.. పైలెట్ మండలానికి శాపంగా మారింది. నాటి రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లు గల్లంతు కావడమే ఇందుకు కారణం. రాష్ట్ర ప్రభుత్వం ధరణి సేవలు కొనసాగించేందుకు మొదట పరిగి మండలాన్ని పైలెట్‌గా నిర్ణయించి 2019లో ప్రారంభించింది. రెండేళ్ల పాటు రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. అయితే సమస్యలు తలెత్తడంతో మళ్లీపాత పద్ధతి అమలు చేయడం.. ధరణి సాఫ్ట్‌వేర్ తొలగించడంతో ఆ కాలంలో చేసిన రిజిస్ట్రేషన్లు మాయమయ్యాయి. దీంతో ఈసీలు రాక.. మ్యుటేషన్లు జరగక.. క్రయవిక్రయాలు లేక గందరగోళంగా మారింది.



ధరణికి పైలెట్
దస్త్రాల గల్లంతే హైలెట్

- పరిగిలో నేటికీ పరిష్కారం కాని నాటి రిజిస్ట్రేషన్లు
- ఈసీలు రాక.. క్రయవిక్రయాలు లేక అవస్థలు
- చొరవచూపని సర్కార్
- తమ చేతుల్లో లేదంటున్న అధికారులు

వికారాబాద్: ధరణి సాఫ్ట్‌వేర్‌ను పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రారంభించారు. రెండేళ్ల పాటు పైలెట్ ప్రాజెక్టుకింద ఈ రెండు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించారు. ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు అనుకూలించిన ధరణి వెబ్‌సైట్ వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లకు అనుకూలించకపోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ధరణి సేవలు నిలిపి వేసింది. అనంతరం చేసేదిలేక పాత పద్ధతి కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) ద్వారా తిరిగి రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగించారు. దీంతో పరిగి కార్యాలయంలోనూ ధరణి సాఫ్ట్‌వేర్‌ను ఆ సంస్థ వారు తొలగించి కార్డ్ సాఫ్ట్‌వేర్‌ను రీ ఇనిస్టాల్ చేశారు. మళ్లీ రిజిస్ట్రేషన్లు ప్రారంభమై రెండేళ్ల గడిచినా ఈ సమస్యకు మాత్రం అధికారులు పరిష్కారం చూపడంలేదు. దీంతో ఆ సమయంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి 10 వేలకు పైగా డాక్యుమెంట్లు మాయమయ్యాయి.

కొంప ముంచిన పైలెట్ ప్రాజెక్టు

పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండేళ్ల పాటు పైలెట్ ప్రాజెక్టు కింద ధరణి సేవలు అందించిన నేపథ్యంలో అప్పటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లన్నీ ధరణి సాఫ్ట్‌వేర్ ద్వారానే జరిగాయి. ఆ రెండేళ్లకు సంబంధించిన వివరాలు, ఈసీలు ఆ సాఫ్ట్‌వేర్‌లోనే ఉండిపోయాయి. ఇప్పుడు కార్డు సాఫ్ట్‌వేర్‌ద్వారా సేవలందిస్తుండటంతో సాఫ్ట్‌వేర్ సపోర్టు చేయక ఈ రెండేళ్లకు సంబంధించి ఈసీలు రావడంలేదు. క్రయ విక్రయాలకు సంబంధించి పది వేలకు పైగా డాక్యుమెంట్లు అందులోనే ఉండిపోయాయి. దీంతో మ్యుటేషన్లు చేసుకోవటం, అనంతరం లోన్లు తీసుకోవడం తదితర ప్రక్రియలకు అంతరాయం ఏర్పడింది. ఈసీలు రాని కారణంగా ఆ సమయంలో రిజిస్ట్రేషన్ అయిన ప్లాటు రీ రిజిస్ట్రేషన్లకు సైతం నోచుకోవడంలేదు. అధికారులు సైతం ఈ విషయంలో చేతులెత్తేశారు. దీంతో ఆ సమయంలో క్రయ విక్రయాలు జరిపిన వారందరూ తమ సమస్యకు పరిష్కారం ఎప్పుడుదొరుకుతుందా అని ఎదురు చూస్తున్నారు.

ఈసీలు ఇవ్వడం కుదరదు



పరిగిలో ధరణి వెబ్‌సైట్ ద్వారా రెండేళ్ల పాటు పైలెట్ ప్రాజెక్టుకింద కొనసాగించాం. ప్రభుత్వ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లు మళ్లీ కార్డు సాఫ్ట్‌వేర్‌ద్వారా నిర్వహిస్తున్నాం. ధరణి సాఫ్ట్‌వేర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆ ప్రక్రియ నిలిపివేసింది. ధరణి సాఫ్ట్‌వేర్‌ను మళ్లీ ప్రవేశపెట్టేవరకు ఆ రెండేళ్లకు సంబంధించిన ఈసీలు ఇవ్వడం కుదరదు.

– సాదిక్‌అలీ, సబ్ రిజిస్ట్రార్, పరిగి

గురుకులం.. సమస్యలే అధికం



అర్ధంతరంగా నిలిచిపోయిన ఎస్‌ఎల్‌బీ కళాశాల భవన నిర్మాణ పనులు

- కనీస వసతులు కరువు
- చెప్పుకోలేని ఇబ్బందుల్లో విద్యార్థినులు
- ఐదేళ్లవుతున్నా పూర్తికాని కళాశాల భవన నిర్మాణం
- 'సంఘం లక్ష్మీబాయి'పై దృష్టిసారించని అధికారులు

వికారాబాద్ అర్బన్: గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కనీస వసతులు కరువయ్యాయి. సమస్యలు చెప్పుకోలేక విద్యార్థినులు నానా అవస్థలకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల ఒకప్పుడు చదువులకు, వసతుల కల్పనకు పెట్టింది పేరు. ఏ ప్రభుత్వ గురుకులాల్లో లేని వసతులు ఇక్కడ కల్పించేవారు. ఈ పాఠశాలలో సీటు సంపాదించాలంటే ఎంట్రెన్స్ రాసి మంచి మార్కులు సాధిస్తేనే సీటు దక్కుతుంది. ఇప్పటికీ ఈ గురుకులంలో అదే స్థాయిలో విద్యా బోధన జరుగుతోంది. ప్రతి ఏటా టెన్త్ ఫలితాల్లో పదుల సంఖ్యలో 10జీపీఏ సాధిస్తుంటారు. అయితే కొన్నేళ్లుగా ఇక్కడ విద్యార్థినులకు వసతుల కొరత వేధిస్తోంది. సరైన వసతులు లేక బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇంటర్ అప్‌గ్రేడ్..

సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంది. సుమారు 450 మంది విద్యార్థినులు ఉంటారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఇంటర్ అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఏటా అన్ని గ్రూపులు కలిపి 150 సీట్ల వరకు పెరిగాయి. ప్రస్తుతం ఆరు వందల వరకు విద్యార్థినులు పాఠశాలలో, కళాశాలలో చదువుతూ వసతి పొందుతున్నారు. అయితే ఇంత మందికి సరిపడా తరగతి గదులు, వసతిగృహంలో గదులు లేవు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదులే ఉన్నాయి. ఇంటర్ తరగతులను కూడా పాఠశాల తరగతి గదుల్లోనే నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో సరిపడా మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేవు. వసతుల కొరత విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఐదేళ్లుగా ఆగిన పనులు

కళాశాలకు ప్రత్యేక భవనం నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయనే ఉద్దేశంతో 2018లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్ల 40లక్షలను మంజూరు చేసింది. ఎస్‌ఎల్‌బీ కంపౌండ్ లోపలే అందుకు స్థలాన్ని కూడా కేటాయించారు. ఈ నిధులతో కళాశాల భవనంతో పాటు, హాస్టల్ వసతి కూడా కల్పించాలని నిర్ణయించారు. 31 మే 2018న అప్పటి మంత్రి మహేందర్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తదనంతరం ఆరు నెలలు పనులు కొనసాగాయి. ఆ తరువాత ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. దాదాపు ఐదేళ్లుగా భవన నిర్మాణం పనులు ఆగిపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ ఏడాది కూడా అనుమానమే..

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు కొత్త భవనం అందుబాటులోకి వస్తుందని విద్యార్థినులు, ఉపాధ్యాయులకు ఎదురు చూపులే దిక్కవుతున్నాయి. ఈ ఏడాది కూడా కొత్త భవనంలో విద్యా బోధన జరిగే అవకాశం లేదు. ఇటీవల కొంత నిధులు విడుదలైనట్లు తెలుస్తుంది. కానీ ఈ విషయంలో అధికారులు ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. నెల రోజుల్లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం అవుతాయి. భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఉన్నాయి. పాత భవనంలో కొత్త చదువులు ప్రారంభం కావాల్సిందేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు చొరవచూపి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిండ్రులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

అనంతగిరి: రైల్వేస్టేషన్లలో, పరిసర ప్రాంతాలలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో అనుమానం కలిగిన వస్తువులను, వ్యక్తులను తనిఖీలు చేసినట్లు తెలిపారు. స్టేషన్, పరిసర ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్, బీడీ టీం అధికారులతో తనిఖీలు చేశారు. ఎవరైనా అనుమానాస్పద స్థితిలో వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో బాంబ్‌స్క్వాడ్ బృందం తనిఖీలు

మళ్లీ భూపోరాటాలు చేస్తాం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణలో మళ్లీ భూపోరాటాలు చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పేదలు ఉంటే భూమి మీద.. లేదంటే జైలులో ఉండేలా పోరాటాలు చేస్తామన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగిన 'ఇంటింటికి సీపీఐ' ముగింపు సభలో ఆయన మాట్లాడారు. భూదాన్ భూములను అడ్డగోలుగా ఆక్రమిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. గతంలో సత్యం రామలింగరాజు భూములపై పోరాటం చేశామని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ భూ పోరాటాలు తప్పేలా లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్న హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజా పోరాటాలకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు లౌకిక, వామపక్ష శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. చర్మకారులు చెప్పులు తయారు చేసుకొని బతుకుతుంటే వారిపై జీఎస్టీ వేసి ఆగం చేస్తోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు పెంచి పేదలపై భారం మోపారని దుయ్యబట్టారు. 30 మంది ముఠాగా ఏర్పడి డ్రగ్స్, గంజాయిలను అఫ్ఘానిస్తాన్ నుంచి సముద్రమార్గం గుండా విశాఖపట్నం తీసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, కావలి నర్సింహ, ముత్యాల యాదిరెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు నీలమ్మ, లక్ష్మణ్, శ్రీశైలం, విజయ్‌కుమార్, కృష్ణ, చంద్రకళ, జయమ్మలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

అభివాదం చేస్తూ.. సమస్యలు ఆలకిస్తూ..

- రంగారెడ్డి జిల్లాలో రెండో రోజు సాగిన భట్టి 'పీపుల్స్ మార్చ్' యాత్ర
- అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి వనస్థలిపురం వరకు..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర రెండో రోజు ఆదివారం కూడా సాగింది. శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడం వద్ద జిల్లాలోకి ప్రవేశించిన ఈ యాత్ర ఆదివారం ఉదయం 10 గంటలకు గుంతపల్లి నుంచి బయలుదేరి లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్, రామోజీ ఫిలింసిటీ, ఓఆర్‌ఆర్ మీదుగా పెద్ద అంబర్‌పేటకు చేరుకుంది. మధ్యాహ్నం అక్కడే భోజనం చేశారు. అనంతరం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ పాదయాత్రగా బయలు దేరి.. సాయంత్రం హయత్‌నగర్ మీదుగా వనస్థలిపురం చేరుకున్నారు. జిల్లాలో పదిహేను కిలో మీటర్లకు పైగా కొనసాగిన పాదయాత్రలో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, కార్నర్ మీటింగ్‌ల్లో వారి సమస్యలను ఆలకిస్తూ ముందుకు కదిలారు.



స్థానికంగా మహిళలతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్న బట్టి విక్రమార్క

గోడు వెళ్లబోసుకున్న భూ బాధితులు

బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లోని 209 మంది రైతుల నుంచి మైనింగ్ కోసం భూములు సేకరించి, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆ గ్రామ నేతలు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం కోసం 18 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. మండలంలో 3,700 మంది దళితులు ఉంటే 17 మందికి మాత్రమే దళిత బంధు ఇచ్చారని తెలిపారు. 2020లో కురిసిన అకాల వర్షాలకు 1,500పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని పలువురు బాధితులు భట్టికి తెలియజేశారు. పరిశ్రమల పేరుతో కేసీఆర్ సర్కారు లాక్కున్న భూములను తాము అధికారంలోకి రాగానే పేదలకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ కార్యదర్శి దండెం రామిరెడ్డి, జెడ్పీటీసీ దాసుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్, ఎంపీపీ బీ రేఖ, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిభావం పెంపొందించుకోవాలి

పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న నేతలు

దోమ: ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రచార కార్యదర్శి రాఘవేంద్రరెడ్డి, సర్పంచ్ జగన్, నాయకులు వెంకటయ్య, నర్సింలు, సాయిలు, కె.వెంకటయ్య, రాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



రామకృష్ణ మృతదేహం

అనంతగిరి: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీను తెలిపిన ప్రకారం.. పీలారం గ్రామానికి చెందిన నర్సింలు కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నాడు. పక్కనే ఉన్న పాత ఇంటిని వంటకు ఉపయోగిస్తున్నారు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో నర్సింలు కుమారుడు రామకృష్ణ(14) భోజనం చేసేందుకు పాత ఇంటికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కూతురు రాజేశ్వరి వెళ్లి గమనించగా అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. ఆమె తండ్రికి విషయం చెప్పడంతో బాలుడిని వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పాత ఇంటి విద్యుత్ కనెక్షన్ వదులుగా ఉండి రేకులపై పడడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడని తండ్రి పోలీసులకు చెప్పాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఆర్ వేధింపులు తట్టుకోలేక..

- కార్మికుడి బలవన్మరణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



సురేశ్ మృతదేహం

కొత్తూరు: ఓ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ వేధింపులు తట్టుకోలేక కార్మికుడు సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పాశం సురేశ్(29) గ్రామ సమీపంలోని వావిన్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కాగా హెచ్‌ఆర్ రవికుమార్ వేధింపులు తట్టుకోలేక సురేశ్ రెండు నెలల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల వివాహానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సురేశ్ ఇంటి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హెచ్‌ఆర్ వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'యువ సంఘర్షణ' సభను విజయవంతం చేయాలి

శంషాబాద్: యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకాగాంధీ పాల్గొనే 'యువ సంఘర్షణ' సభకు పార్టీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధి 'ఫ్రీజింగ్'

గ్రామాల అభివృద్ధికి నిధుల ఫ్రీజింగ్ అడ్డంకిగా మారింది. నోటితో మాట్లాడి నొసటితో ఎక్కిరించారనే చందంగా ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా పనులు గడప దాటడం లేదు. నిధులు మంజూరు చేయండని సర్పంచ్‌లు కోరుతున్నా.. పట్టించుకునే వారే లేరు.

- బిల్లులు అందక ఇబ్బంది పడుతున్న సర్పంచ్‌లు
- ఆరు నెలలుగా అందని గౌరవ వేతనాలు



కుల్కచర్ల పంచాయతీ కార్యాలయం

కుల్కచర్ల: సర్పంచ్‌ల పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది. అప్పులు తెచ్చి అభివృద్ధి చేస్తే కనీసం వడ్డీ కట్టేందుకు కూడా నిధులు విడుదలవ్వడం లేదు. అప్పుడప్పుడు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా పెద్దల నుంచి బెదిరింపులు తప్పడం లేదని పలువురు సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు.

రూ.6 కోట్ల నిధుల పెండింగ్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ(స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధుల నుంచి గ్రామీణ ప్రజలకు సౌకర్యాలు, సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు జనభా ప్రాతిపదికన నిధులను విడుదల చేస్తుంటుంది. ఈ నిధులను అధికార యంత్రాంగం ఫ్రీజింగ్‌లో ఉంచడంతో సర్పంచులు చేపట్టిన పనులకు నిధులు అందడం లేదు. మండల పరిధిలోని 44 గ్రామ పంచాయతీలకు కలిపి రూ.6కోట్ల నిధులు తొమ్మిది నెలలుగా నిలిచిపోయాయి.

అందని జనరల్ ఫండ్

టాక్స్, తైబజార్, ఇళ్ల అనుమతులు వంటి వనరుల సమీకరణతో గ్రామ పంచాయతీకి జనరల్ ఫండ్ లభిస్తుంది. వీటిని పంచాయతీ అధికారులు వారి గ్రామాల ఖాతాల్లో వేసి ఎస్టీఓలో జమ చేస్తారు. గ్రామంలో చేపట్టిన పనులను అధికారులు పరిశీలించాక బిల్లులు పొందేందుకు ఎస్టీఓలకు దరఖాస్తు చేసుకుంటారు. ప్రస్తుతం వీటిని సైతం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఇబంది పడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన పనులకు నిధులు త్వరితగతిన అందకపోవడంతో ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పనులు నిర్వహించిన సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లోని ఏ ఒక్క పనికి నిధులు అందక ఇబ్బంది పడుతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

నిలిచిన పంచాయతీ భవనాల నిర్మాణం

నిధులు నేటికీ పెండింగ్‌లోనే ఉండడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. కానీ పనులు చేపట్టాక బిల్లులు వస్తాయో.. లేదోనని పనులు నిర్వహించేందుకు వెనుకంజ వేస్తున్నారు. దీనికి తోడు సర్పంచ్‌లకు అందాల్సిన గౌరవ వేతనం ఆరు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటికైనా నిధుల విడుదల చేయాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పలువురు చర్చించుకుంటున్నారు.

సౌకర్యాల కల్పనకు ఇబ్బంది



ఇప్పటికే చేపట్టిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో వేరే కార్యక్రమాలు చేయడం లేదు. ఇప్పటికే రూ.30లక్షల బిల్లులు రావాల్సి ఉంది. దీంతో ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఫ్రీజింగ్‌లో ఉంచిన నిధులు విడుదల చేస్తే ఇబ్బందులు తొలుగుతాయి.

– సౌమ్యారెడ్డి, సర్పంచ్, కుల్కచర్ల

వడ్డీలు పెరుగుతున్నాయి



గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు అప్పులు తెచ్చాం. వాటి వడ్డీలు పెరుగుతున్నాయే తప్ప బిల్లులు రావడం లేదు. నిధులు ఫ్రీజింగ్‌లో పెట్టడం సరికాదు. నూతన పనులు నిర్వహించేందుకు అడ్డంకిగా మారాయి.

– లక్ష్మి, సర్పంచ్, ముజాహిద్‌పూర్

చర్యలు తీసుకుంటున్నాం



గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఎస్ఎఫ్‌సీ ఫ్రీజింగ్ చేయడం రాష్ట్ర పరిధిలోని అంశం. గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడకుండా క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఖరీం, ఎంపీఓ, కుల్కచర్ల

సరిహద్దులో రెండంచెల తనిఖీలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు



చంద్రకల్ జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీంతో రెండంచెల తనిఖీలు జరుగుతున్నాయి. చెక్‌పోస్టులను ఎప్పటికప్పుడు ఆయా శాఖల ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే వికారబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఆయా చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కర్నాటక పోలీసు ఉన్నతాధికారులతో సైతం సమావేశమై నిఘా విషయమై చర్చించారు. కర్నాటక రాష్ట్రం యాదగిరి, గుల్బార్గ జిల్లాల ఎస్పీలు తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. తెలంగాణ నుంచి కర్నాటకలోకి అక్రమంగా మద్యం, డబ్బు తరలకుండా నిఘా ఉంచారు.

మతసామరస్యానికి ప్రతీక 'చిట్లపల్లి దర్గా'

ఆది, సోమ, గురు, శుక్ర వారాల్లో భక్తుల తాకిడి



చిట్లపల్లి దర్గా

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అంగడిరాయిచూర్ శివారులో వెలిసిన చిట్లపల్లి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అంతకంతకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. మతపెద్దల కథనం ప్రకారం 200 ఏళ్ల క్రితం అంగడిరాయిచూర్ చెరువు సమీపంలో ఈద్గా దగ్గర ముస్లింలు రంజాన్, బక్రీద్ పండగ రోజుల్లో ప్రార్థనలు చేసేవారు. ఈ ఈద్గా వద్ద ఎక్కడి నుండో వచ్చిన అబ్దుల్లా సాహెబ్ నమాజ్ చేసుకుంటూ సమాధి అయ్యారని కథనం. నాటి నుంచి భక్తుల కోర్కెలు నెరవేరుస్తూ ఆపదల నుంచి విముక్తి కలిగిస్తున్నారని ప్రజల విశ్వాసం. ప్రతీ సంవత్సరం దర్గా ఉత్సవాలు నిర్వహించే సమయంలో కొడంగల్, అంగడిరాయిచూర్, చిట్లపల్లి, సంఘాయిపల్లి, లక్ష్మీపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి గంధం ఊరేగింపులో పాల్గొంటారు. మొదటగా అంగడిరాయిచూర్ గ్రామానికి చెందిన బిందు మాధవ్ ఇంటి నుంచి గంధం తీసుకువచ్చి అల్లాకు సమర్పించడం ఆనవాయితీ. అబ్దుల్లా సాహెబ్ రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో సంచరిస్తూ తమను కాపాడుతాడని భక్తుల నమ్మిక. ఈ క్రమంలోనే ఆపదలు తొలగిన భక్తులు ఆది, సోమ, గురు, శుక్ర వారాల్లో కందూర్‌లు చేస్తూ అల్లాను స్మరించుకుంటారు. ఇటీవల దర్గా ప్రాంతాన్ని పాలరాతి కట్టడంతో అభివృద్ధి చేశారు.

పత్తి సాగుకే మొగ్గు..!



- బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్
- 60 వేల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా

షాబాద్: వానాకాలంలో సీజన్‌లో పత్తి సాగుకు రైతులకు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,080 ఉండడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ.9,500 పలుకుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. గతేడాది వానాకాంలో జిల్లాలో 45,894 ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారు. ఈసారి సుమారు 60 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

మార్కెట్‌కు చేరిన విత్తనాలు

పత్తి దిగుబడి తగ్గినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంతో రైతులు లాభాలు గడించారు. జూన్‌లో సాగు ప్రారంభిస్తే అక్టోబర్‌లో పంట చేతికందుతుంది. పంట చేతికందిన ఆరంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9,500 పలికింది. అప్పటికే రైతులు 80శాతం పంట విక్రయించారు. కొంతమంది ధర పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం ధర రూ.7,500కు పడిపోవడంతో చేసేదేమీ లేక అమ్ముకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు అదనంగా రూ.3,420 ఎక్కువగా పలకడంతో పత్తి సాగుకు డిమాండ్ ఏర్పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతీ సంవత్సరం వానాకాలం సీజన్‌లో జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో పత్తి సాగు చేస్తారు. మరో 20 రోజుల్లో సీజన్ ప్రారంభం అవుతుండడంతో ఇప్పటికే పత్తి విత్తనాలు మార్కెట్‌కు చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయించే అవకాశాలున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూ వివాదంలో ముగ్గురిపై కేసు

నందిగామ: భూ వివాదంలో ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన ప్రకారం.. వీర్లపల్లికి చెందిన కాసులాబాద్ శంకరయ్య, బండగోనిగూడకు చెందిన బుచ్చయ్య, మేకగూడకు చెందిన సాంబయ్యల నుంచి నర్సప్పగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ చేగూరు శివారు సర్వే నంబరు 78లో 3.19 ఎకరాల భూమిని గతేడాది ఫిబ్రవరి 10న కొనుగోలు చేశాడు. ఇందుకు రూ.1.50కోట్లు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో గడువులోగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ చేయాలని పట్టాదారులను కోరాడు. ఇందుకు వారు నిరాకరించి బెదిరింపులకు పాల్పడి ఒప్పందం రద్దు చేసుకున్నట్లుగా సంతకం చేయించుకున్నారు. తీసుకున్న అడ్వాన్సు ఇవ్వకుండా, భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. ఇదే విషయమై కాసులబాద్ శంకరయ్య(వీర్లపల్లి శంకర్) ను వివరణ కోరగా భూమిని సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని.. పలుమార్లు గడువు పొడిగించామన్నారు. డబ్బులు సర్దుబాటు కావట్లేదని చెప్పి శ్రీనివాస్ ఒప్పంద పత్రాన్ని రద్దు చేసుకున్నాడన్నారు. తాను తప్పు చేయనని.. మేం రాసుకున్న పేపర్లు చూపుతానన్నారు. కోర్టులో చూసుకుంటామని చెప్పారు.

శివలింగ దర్శనం.. పూర్వజన్మ సుకృతం

టాలీవుడ్ దర్శకుడు శ్రీను వైట్ల



శ్రీను వైట్లను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మరకత శివలింగాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ టాలీవుడ్ సినీ దర్శకుడు శ్రీను వైట్ల అన్నారు. ఆదివారం మండలంలోని చందిప్ప గ్రామంలోని 11వ శతాబ్దం నాటి మరకత శివలింగానికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శివలింగం చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సదానందం గౌడ్, సభ్యులు దయాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో..

- మేకలు మృతి
- సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల ఆందోళన



మృతి చెందిన మేకలను చూపుతున్న బాధితులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లచ్చంపేట గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధితులు తుమ్మలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. నాలుగు రోజుల క్రితం లచ్చంపేట శివారులోని బోయ భీమయ్య పొలంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. సంబంధింత అధికారులు నేటికీ వాటిని సరిచేయలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన గోరుపల్లి కుమార్‌కు చెందిన మేకలు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానికులు సబ్‌స్టేషన్ ఎదుట మేకల కళేబరాలతో ఆందోళన చేపట్టారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అల్లం, వెల్లుల్లి పేస్ట్ నుంచి కూల్ డ్రింక్స్ దాకా..



స్వాధీనం చేసుకున్న అల్లం,వెల్లుల్లి పేస్ట్

- రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాల తయారీ
- పరిశ్రమపై ఎస్‌ఓటీ దాడులు
- ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్

రాజేంద్రనగర్: అనుమతులు లేకుండా పరిశ్రమను నిర్వహించడమేగాక రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాలు(కూల్‌డ్రింక్స్) తయారు చేస్తున్న కర్మాగారంపై ఆదివారం రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 500 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో డ్రింక్, 210 లీటర్ల అసిటిక్ యాసిడ్, 550 కిలోల మసాలా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ శాంతినగర్‌లో ఫిరోజ్, అజిత్ రెండేళ్లగా అనుమతులు లేకుండా ఉమ్మాని ఫుడ్ కంపెనీ పేరుతో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. సదరు పరిశ్రమలో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తో పాటు మ్యాంగో, ఆరెంజ్ జ్యూస్‌తో పాటు ఫుడ్ మసాలాలను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. వీటి తయారీకి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లో వెల్లుల్లి పొట్టును మాత్రమే వినియోగిస్తుండటం గమనార్హం. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో రెండేళ్లగా అల్లమే వాడకుండా తయారు చేస్తున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిన సమయంలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న పదార్థాలే కనిపించాయి. శీతల పానీయాలను తయారు చేసేందుకు మురుగునీటిని వాడుతున్నారని, ఫ్లేవర్ల కోసం రసాయనాలను వినియోగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రెండేళ్లుగా నిందితులు ఎలాంటి అనుమానం రాకుండా పరిశ్రమను నిర్వహించడం గమనార్హం. పెద్ద ఎత్తున ఉత్పత్తులు చేస్తున్న వీరు రాష్ట్ర వ్యాప్తంగా వాటిని సరఫ రా చేసినట్లు వెల్లడైంది. నిందితులను అదుపులోకి తీసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

అధునాతన యంత్రాల వినియోగం...

అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు గరంమసాలాలు, శీతల పానీయాల మిక్సింగ్, ప్యాక్ చేసేందుకు నిందితులు అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో ఉన్న ఈ యంత్రాల ద్వారా ప్రతి రోజు రూ.లక్షల విలువైన మసాలాలు, అల్లం పేస్ట్, శీతల పానీయాలను తయారు చేస్తున్నారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశామని, స్వాధీనం చేసుకున్న పదార్థాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

హైనాలా.. వీధికుక్కలా..?

- వారం రోజుల వ్యవధిలోనే 10కి పైగా దూడల మృతి
- ఏడాదిలో 500కి పైగా మృత్యువాత
- సరిహద్దు అటవీ ప్రాంతాల వద్ద ఘటనలు
- భయాందోళనలో కాపరులు



నస్దిక్‌సింగారం గ్రామంలో మృతి చెందిన దూడను చూపుతున్న రైతు

యాచారం: తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం చుట్టూ వ్యవసాయ బావులు ఉన్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి పూట పొలాల వద్ద కట్టేసిన పశువులు, గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి చంపేస్తున్నాయి. దాడి చేస్తోంది హైనాలా లేక వీధికుక్కలా అనేది రైతులకు అంతుపట్టడం లేదు. తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం దాదాపు 15 వేల ఎకరాలకు పైగా విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతం యాచారం, మాడ్గుల్, ఆమన్‌గల్, కడ్తాల్, కందుకూర్ మండలాల సరిహద్దులో ఉంది. అటవీ ప్రాంతం పక్కనే ఆయా మండలాల్లోని గ్రామాల రైతుల వ్యవసాయ బావులు ఉన్నాయి. రైతులు పొలాల వద్ద తమ పాడి, పశువులు, గొర్రెలు, మేకలను కట్టేసి రాత్రి పూట ఇంటికెళుతుంటారు. ఉదయం వచ్చి మేతకు వదులుతారు. ఇలా అటవీ ప్రాంతం అంచునే ఆయా మండలాలకు చెందిన 1,500 మందికి పైగా వ్యవసాయ బావులు ఉన్నాయి. మందల్లో, దొడ్లల్లో లక్షకు పైగానే పాడి పశువులు, మేకలు, గొర్రెలను ఉంచుతారు. ఇటీవల ఆ మందలపై అడవి జంతువులు దాడి చేసి చంపేస్తున్నాయి.

హైనాలు.. వీధి కుక్కలా?

15వేల ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న ఈ అటవీ ప్రాంతం అంచునే ఉన్న మూగ జీవాల మందలపై నిత్యం ఏదో ఒక చోట దాడులు చేసి చంపేస్తున్నాయి. ఏడాదిలో ఆయా మండలాల్లో 50కి పైగా దాడులు జరిగి 500కు పైగానే గొర్రెలు, మేకలు, పాడి, పశువులు, దూడలు మృతి చెందాయి. తాజాగా వారం రోజుల వ్యవధిలోనే యాచారం మండలం నస్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి, కడ్తాల్ మండలం పల్లెచల్క తండా, సరికొండ గ్రామాల్లో పదికి పైగా దూడలు మృతి చెందాయి. దాడులతో రైతులు కూడా రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఇన్ని సంఘటనలు జరిగినా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

నాడు చిరుత పులుల భయం

తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతంలో నాడు చిరుతలు సంచరించేవి. అవి జీవాలపై దాడి చేసి చంపేవి. అటవీ ప్రాంతంలో ఆహారం దొరక్క అవి పొలాల్లోని జీవాలపై దాడులు చేసి చంపేస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతంలో వందకు పైగా జింకలను వదిలారు. నాటి నుంచి చిరుతల సంచారం తగ్గుముఖం పట్టింది. చిరుతలు తాడిపర్తి – కుర్మిద్ద అటవీ ప్రాంతం నుంచి అచ్చంపేట రిజర్వ్ ఫారెస్టులోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. దీంతో చిరుతల భయం తగ్గింది. తాజాగా మళ్లీ జీవాలపై దాడులు జరుగుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పొలాల వద్ద దాడులు



కుర్మిద్ద గ్రామ సమీపంలో పొలం ఉంది. రెండు రోజుల క్రితం పొలం వద్ద దూడను కట్టేసి ఇంటికి వెళ్లా. ఉదయం వచ్చే సరికి దానిపై ఏదో జంతువు దాడి చేసి చంపేసింది. దాడి చేసింది హైనాలా.. వీధి కుక్కలా అనేది తెలియడం లేదు. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

– బాలయ్య, రైతు, కుర్మిద్ద

పరిహారం లేదు



గత ఏడాది తాడిపర్తి – కుర్మిద్ద గ్రామాల సరిహద్దులో ఉన్న పొలాల వద్ద కట్టేసిన 150కి పైగా పశువులు, గొర్రెలు, మేకలు ఇతర జంతువుల దాడిలో చనిపోయాయి. అటవీ శాఖ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తున్నారే తప్ప పరిహారం ఇవ్వడం లేదు.

– రమేష్, సర్పంచ్, దాడిపర్తి